వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం కావాలి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- పార్టీ వివిధ విభాగాల సభ్యులకు సత్కారం


పార్టీ వివిధ విభాగాల నాయకులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, వరుపుల సుబ్బారావు

అనపర్తి: వచ్చే ఎన్నికలు అత్యంత కీలకమని, వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. పార్టీ ఇటీవల ప్రకటించిన రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ శాఖల్లో వివిధ పదవులకు నియమితులైన నాయకులను స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోజురోజుకూ ప్రభుత్వంపై ప్రజల్లో ఆదరణ పెరుగుతోందన్నారు. ఆదరణ కోల్పోతున్న టీడీపీ వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా పోటీకి దిగలేక జనసేనపై ఆధారపడుతుందన్నారు. ఎంతమంది కలసి వచ్చినా వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపలేరన్నారు. గతం కంటే అధిక మెజార్టీతో విజయం సాధించేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో అమలవుతున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ పార్టీలో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న మేలును ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం వివిధ విభాగాలకు ఎంపికైన నాయకులను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి, గ్రామ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ వారా కుమారి, పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముఖి చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకూ..

బిక్కవోలు: ప్రజా సమస్యల పరిష్కారానికే సీఎం జగన్ గడప గడపకూ కార్యక్రమానికి రూపకల్పన చేశారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. రంగాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి ఆయన వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత చంద్రబాబు పాలనలో పాఠశాలలు, ప్రభుత్వాసుపత్రులు నిర్వీర్యం అయ్యాయన్నారు. సర్పంచ్ గండికోట వీరభద్రరావు, ఉప సర్పంచ్ శాంతికుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, కొమరిపాలెం ఉప సర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, సచివాలయ కన్వీనర్ నక్క వీర వెంకటరమణ, ఇజ్జన లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

- బలభద్రపురంలో గురువారం నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

క్లుప్తంగా

పరీక్ష మెటీరియల్ పంపిణీ


విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ అందజేస్తున్న ఎంఈవో కుశలవ దొర

మధురపూడి: కోరుకొండ మండలం గుమ్ములూరు హైస్కూల్లో బుధవారం విద్యార్థులకు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) మెటీరియల్‌ను ఎంఈవో కుశలవ దొర పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవ్వడానికి ఈ మెటీరియల్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం యు.గంగాభవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఉపాధ్యాయ దినోత్సవం

గోకవరం: యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం గోకవరంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించనున్నట్టు యూటీఎఫ్ నాయకుడు ఎస్.అనిల్‌కుమార్ బుధవారం తెలిపారు. సుంకర వెంకటరమణ, సావిత్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్వీఆర్ ఫంక్షన్ హాలులో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలి

రంగంపేట: స్థానిక శివారు ఎస్టీ కాలనీలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని పలువురు బీజేపీ నేతలు కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని పోలింగ్ కేంద్రాలపై సమావేశం జరిగింది. రంగంపేట ఎస్టీ కాలనీ ఓటర్లు వేటు వేయాలంటే రెండు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందని, ఇక్కడి పాఠశాలలో కొత్తగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని నాయకులు కోరారు. అనంతరం మండల బీజేపీ అధ్యక్షుడు ఎం.సాయిరామ్ ఆధ్వర్యంలో పలువురు తహసీల్దార్ ఎం.దొరకయ్యకు వినతిపత్రం అందించారు.

గిన్నిస్ రికార్డు సాధనలో ప్రతిభ


జెస్సీ విల్సన్

పెదపూడి: ఊలు దారాలతో పోంచోస్ (మహిళలు ధరించే ఊలు వస్త్రాలు) తయారు చేసి విశాఖపట్టణానికి చెందిన మహిళా మనోవికాస్ సంస్థ గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించింది. ఇందులో పెదపూడి మండలం చింతపల్లి లాక్‌కు చెందిన జుత్తుక జెస్సీ విల్సన్ భాగస్వామిగా గిన్నిస్ రికార్డు అందుకున్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆ సంస్థ వ్యవస్థాపకురాలు సూరిభట్ల మాధవి ఆధ్వర్యంలో 250 మంది గృహిణులు కలసి మూడు నెలల్లో 2,719 పోంచోస్‌లు తయారు చేసి గిన్నిస్ రికార్డు సృష్టించారన్నారు. దీంతో గిన్నిస్ రికార్డు ప్రతినిధులు ధ్రువీకరణ పత్రం అందించారన్నారు. ఈ పోంచోస్‌ను గిరిజన ప్రాంతాల్లో మహిళలకు ఉచితంగా అందజేస్తామన్నారు.

కొత్త పింఛన్ల మంజూరు

బిక్కవోలు: మండలానికి కొత్తగా మూడు వందల పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ జేఏ ఝాన్సీ తెలిపారు. ఆరికరేవుల 6, బలభద్రపురం 31, బిక్కవోలు 60, ఇలపల్లి 10, కాపవరం 16, కొమరిపాలెం 35, కొంకుదురు 35, మెళ్లూరు 6, పందలపాక 42, రంగాపురం 22, తొస్సిపూడి 13, ఊలపల్లి 24 మంది లబ్ధిదారులకు మంజూరయ్యాయని అన్నారు. వీటిని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధుల సమక్షంలో అందిస్తామన్నారు.

అర్హులందరికీ పథకాలు

గోకవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ పింఛన్లు అందుతున్నాయని ఆ పార్టీ సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, మండల కన్వీనర్ పాటి రాంబాబు అన్నారు. మండలంలో రంపయర్రంపాలెం, గుమ్మళ్లదొడ్డి, వెదురుపాక, అచ్యుతాపురం, కృష్ణునిపాలెం, తంటికొండ తదితర గ్రామాల్లో లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన పింఛన్లను బుధవారం వారు పంపిణీ చేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనపర్తి: కుతుకులూరు, అనపర్తి పాతవూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, 11 కేవీ లైన్‌లో చెట్ల కొమ్మలు తొలగించే పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ఈ విషయాన్ని బుధవారం రాజమహేంద్రవరం ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో అనపర్తి పాతవూరు సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు.. అలాగే లక్ష్మీనరసాపురం, మహేంద్రవాడ, కొప్పవరం, అనపర్తి పాతవూరు, మహాలక్ష్మీపేట, అనపర్తి సావారం, ధరణికోట ఏరియా, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయ ప్రాంతాల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. ఇదిలా ఉండగా కుతుకులూరు సబ్‌స్టేషన్ పరిధిలోని కుతుకులూరు, రామవరం, పులుగుర్త, పెడపర్తి గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ప్రజా సేవే ధ్యేయంగా పాలన


పందలపాకలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: ప్రజా సేవే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం పందలపాకలో రూ.90 లక్షలతో నిర్మించిన రెండు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రం, పలు సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. గ్రాసిం ఇండస్ట్రీ సహకారంతో నిర్మించిన కమ్యూనిటీ భవనాల శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ సీఎం జగన్‌ను తిరిగి ఆశీర్వదించి సంక్షేమ పథకాలను కొనసాగించేందుకు సహకరించాలని ప్రజలను ఆయన కోరారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని సేవలూ అందుతున్నాయని, ప్రజల ఆరోగ్య సంరక్షణకు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు దోహదపడతాయని వివరించారు. సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ కర్రి గీతా సావిత్రి, వార్డు సభ్యులు పడాల దుర్గారెడ్డి, గండి రామతులసి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కిలపర్తి సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్ పడాల వీరరాఘవరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

- అనంతరం ఆరికరేవులలో గ్రాసిం ఇండస్ట్రీస్ సహకారంలో నిర్మించిన కమ్యూనిటీ హాలును ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రజల అవసరాలు తీర్చేందుకు ఈ భవనాలు ఉపయోగపడతాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గురు నాగేశ్వరరావు, గ్రామ కన్వీనర్ గాంధీరెడ్డి, గొడ్డు సూర్యనారాయణ, కడియం దుర్గారావు, కొమరిపాలెం ఉప సర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, మెళ్లూరు ఉప సర్పంచ్ కొమ్మన ఆనంద్, కొంకుదురు సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తో సుపరిపాలన


కొత్త పింఛన్లు అందిస్తున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ గంగాభవాని

అనపర్తి: సీఎం జగన్‌తో రాష్ట్రంలో సుపరిపాలన సాగుతుందని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. రామవరంలో కొత్త పింఛన్లను పంపిణీ చేశారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి పేదవాడికి లబ్ధి చేకూర్చాలన్నదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీఎం జగన్ ఆకాంక్షలకు అనుగుణంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రజలకు పారదర్శక పాలన అందిస్తున్నారన్నారు. గత పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ మద్దతుతో రామవరం సర్పంచ్‌గా పోటీ చేసి ఓటమి చెందిన వ్యక్తికే పింఛను అందించడం రాజకీయాలకు అతీతంగా అందిస్తున్న పాలనకు నిదర్శనమన్నారు. అనంతరం 45 మంది లబ్ధిదారులకు కొత్త పింఛన్లను సర్పంచ్ గిరడా గంగాభవాని, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి తదితరులు అందజేశారు. ఎంపీటీసీ నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, పార్టీ మండల అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి, సచివాలయ కన్వీనర్లు నల్లమిల్లి రాజు, మేడపాటి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు

ఘర్షణపై కేసు నమోదు

బిక్కవోలు: రంగాపురంలో ఘర్షణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. ఆ గ్రామానికి చెందిన తంగెళ్ల దుర్గాప్రసాద్ అతని భార్య దేవి ఈ నెల 7న గొడవ పడుతున్నారు. ఈ నేపథ్యంలో అత్తా మావయ్య నక్కా దుర్గ, దుర్గయ్య, మరదలు హారిక పాటు భార్య దేవి కలసి తనను, తన తల్లిదండ్రులను గాయపరిచినట్లు ప్రసాద్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

బైక్ చోరీ

తొస్సిపూడికి చెందిన తేతలి శ్రీనివాస్‌రెడ్డి తన ఇంటి వద్ద ఈ నెల 11న రాత్రి బైక్‌ను పార్కు చేసి తిరిగి ఉదయం చూసేసరికి కనిపించలేదు. దీనిపై అతను ఫిర్యాదు చేసినట్లు ఎస్సై పి.బుజ్జిబాబు వివరించారు.

చంద్రశేఖరస్వామికి అభిషేకాలు

రంగంపేట: చంద్రేడులో కొలువైన శ్రీకాత్యాయినీ సమేత చంద్రశేఖర స్వామి ఆలయంలో స్వామివారికి బుధవారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. ఉదయం 4 గంటల నుంచి ప్రారంభమైన అభిషేక పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి

అనపర్తి: విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని ఎంఈఓ బి.పుష్పలత అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 విభాగాల్లో బాలికల మండల స్థాయి క్రీడా పోటీలు, ఎంపికలను ఆయన ప్రారంభించారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి మొత్తం 96 మంది బాలికలు పాల్గొన్నట్లు నియోజకవర్గ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

- జక్కంపూడి గణేష్
- మిర్తిపాడులో గడప గడపకూ..


ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకుంటున్న జక్కంపూడి గణేష్

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. మండలంలోని మిర్తిపాడులో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ, లబ్ధి పొందిన వివరాలను తెలుపుతూ బుక్‌లెట్లు అందజేశారు. గణేష్ మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో అర్హులందరికీ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. కరోనా వంటి విపత్కర సమయంలో ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కో కన్వీనర్ కరుటూరి శ్రీహరి బాబు, ఎంపీటీసీ మాకిరెడ్డి దేవి, సచివాలయ కన్వీనర్ మాకిరెడ్డి సాయి కళ్యాణ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఏకరాజు, పీఎంసీ చైర్మన్ డొక్కా నాగేశ్వరరావు, పార్టీ నాయకులు జొన్నలగడ్డ సత్యనారాయణ, పోతిరెడ్డి వినాయకరావు, అల్లి నాయుడు, కడుపుల కృష్ణ, గోసాల మహేష్, కోడూరి నవీన్, విరిగేటి గంగరాజు పాల్గొన్నారు.

ధ్యానంతో బహుళ ప్రయోజనాలు


మాట్లాడుతున్న ట్రైనర్ సవిత

రాజానగరం: నిత్యం ఎంతో కొంత సమయాన్ని ధ్యానానికి కేటాయించడం వలన బహుళ ప్రయోజనాలను పొందవచ్చని హార్ట్‌ఫుల్‌నెస్ ఎడ్యుకేషనల్ ట్రస్టుకు చెందిన ట్రైనర్ సవిత అన్నారు. గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫస్టియర్ విద్యార్థులకు జీవిత నైపుణ్యాలపై ధ్యానం అనే అంశంపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా విద్యార్థులు ధ్యానం చేయడం వల్ల ఒత్తిడిని అధిగమించడంతోపాటు చురుకైన ఆలోచనా శక్తిని పొందగలరన్నారు. తద్వారా ఎంచుకున్న లక్ష్యాలను సులువుగా చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.లీలావతి, డీన్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ పీఓ వైడీ శివప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో డ్వాక్రా సంఘాలు


జంబూపట్నంలో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: స్వయం సహాయక సంఘాలు ప్రగతి పథంలో నడుస్తున్నాయని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. కోరుకొండ మండలం జంబూపట్నం సచివాలయంలో బుధవారం డ్వాక్రా గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలను మహారాణులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ఉందన్నారు. అర్హులందరికీ అన్ని సంక్షేమ పథకాలు అందజేయాలన్న ఉద్దేశంతో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పలువురు డ్వాక్రా మహిళలు స్థానిక సమస్యలను తెలియజేశారు. సమావేశంలో సర్పంచ్ ఉల్లి దొర, ఉప సర్పంచ్ కర్రి శాంతి, వైఎస్సార్ సీపీ నాయకులు ఉల్లి గణ, ఉల్లి చెల్లారావు, తోరాట సత్యప్రసాద్, బుల్లియ్య నాయుడు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాల నివారణకు కృషి


సంపర పీహెచ్‌సీలో మాట్లాడుతున్న మోహన్‌రావు

పెదపూడి: మాతా శిశు మరణాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కిలారి సేవల కార్యక్రమ వైజాగ్ రీజినల్ ప్రోగ్రామ్, కేఎంఏ అధికారి ఆర్.మోహన్‌రావు అన్నారు. సంపర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆయన ఆశ వర్కర్లు, ఆస్పత్రి సిబ్బందికి కిలారి సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యంపై భారత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహార నియమాలు, సకాలంలో చేయించుకోవాల్సిన వైద్య పరీక్షలు, తదితర వాటిపై అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు 01244588000 నంబర్‌కు కాల్ చేస్తే అవసరమైన ఆరోగ్య సమాచారం పొందవచ్చన్నారు. డాక్టర్లు డి.శ్యామల, ఎస్‌యూ శిరీష, డీపీహెచ్ఎన్‌వో రమణమ్మ, ఎంపీహెచ్‌వో ఆర్ఎస్‌వీ ప్రకాష్, హెచ్ఈ విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి


మాట్లాడుతున్న సీఐ ఉమామహేశ్వరరావు, చిత్రంలో ఎస్సై సతీష్

మధురపూడి: వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరుకొండ సీఐ ఉమామహేశ్వరరావు ఆదేశించారు. కోరుకొండ పోలీసు స్టేషన్‌లో బుధవారం గణేష్ మండపాల కమిటీలు, ఆర్గనైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణ, నిమజ్జనంపై వివరాలు ముందుగానే పోలీసులకు ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరూ అనుమతులు పొందాలన్నారు. మండపాల రక్షణకు చర్యలు తీసుకోవాలని, నిమజ్జనం సందర్భంలో వాహనాల వివరాలు, డ్రైవర్ల చిరునామా కూడా అందజేయాలన్నారు. సమావేశంలో ఎస్సై కట్టా శారదా సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం


హెచ్ఎం లక్ష్మణుడిని సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీతానగరం: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న కూనవరం ఎంపీపీ యూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు పోలిమాటి లక్ష్మణుడిని వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఎంఈవో కె.స్వామినాయక్, వైఎస్సార్ సీపీ సర్పంచ్ సుంకర గంగాలక్ష్మి, ఎంపీటీసీ నల్లమోలు భాస్కర్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ అయిల పాపారావు, పీఎంసీ చైర్మన్ నందూరి వీరభద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకుల చేతుల మీదుగా ఆ పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది. పార్టీ నాయకులు సుంకర నరసింహరావు, అయిల గాంధీ, అయిల మధు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు గుప్తా, యూటీఎఫ్ మండల కార్యదర్శి కె.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయండి

ఎంపీపీ కేతా తులసి


ఎంపీడీఓ విజయభాస్కర్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

పెదపూడి: అభివృద్ధే ధ్యేయంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ కేతా తులసి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులపై ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులకు తెలియజేయాలన్నారు. ఇరిగేషన్, డ్రైనేజీ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్లు భవానీ, క్రాంతిలను పంట కాలువలు, డ్రైనేజీలు పూడికపోయి సాగు, మురుగునీరు సక్రమంగా ప్రవహించడం లేదని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు నిలదీశారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. డిప్యూటీ తహసీల్దార్ రామ్‌కుమార్ మాట్లాడుతూ 15న పెదపూడిలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో స్పందన ఉంటుందన్నారు. వైస్ ఎంపీపీ కర్రెడ్ల వెంకన్నబాబు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు ఘన సన్మానం

ఎంపీడీఓ పి.విజయభాస్కర్ ఇటీవల డీఎల్‌డీఓగా పదోన్నతి పొందారు. త్వరలో బదిలీపై వెళ్లనున్న ఆయనకు ఎంపీపీ కేతా తులసి అధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీ సభ్యురాలు పి.వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ కాప్ప కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, పార్లమెంట్ నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ కేతా శ్రీను, హితకారిణి సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, నియోజకవర్గ సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కొటికలపూడి చినబాబు, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల రమణ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర ఉద్యమంలో ఆదివాసీల పాత్రపై పరిశోధన


ప్రాజెక్టు పత్రాలను అందజేస్తున్న నన్నయ వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: భారత స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొన్న ఆదివాసీలపై పరిశోధన జరిపి, నేటి తరానికి అందించాల్సిన అవసరం ఎంతో ఉందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. భారత స్వాతంత్య్ర ఉద్యమంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఆదివాసీయుల పాత్ర అనే అంశంపై ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్ - న్యూఢిల్లీ) మేజర్ ప్రాజెక్టుకు నన్నయ వర్సిటీ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్బారావును డైరెక్టర్‌గా, అధ్యాపకులు డాక్టర్ ఆర్ఎస్ వరహాలదొర, డాక్టర్ ఆర్.సాంబశివరావు, డాక్టర్ జె.రాజామణిలను కో డైరెక్టర్లుగా ఎంపిక చేశారు. ఇందుకు సంబంధించిన ప్రాజెక్టు పత్రాలను వీసీ వారికి బుధవారం అందజేస్తూ, అభినందనలు తెలిపారు. ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ ఈ అంశంపై ఇప్పటివరకు చాలా తక్కువగానే పరిశోధనలు జరిగాయన్నారు. ఈ కారణంగానే ఐసీఎస్ఎస్ఆర్ ద్వారా ఈ ప్రాజెక్టుకు రూ.10 లక్షలు కేటాయించారన్నారు. రెండేళ్ల వ్యవధిలోనే ప్రాజెక్టును పూర్తి చేసేలా కృషి చేస్తామన్నారు.

ఘనంగా పోషకాహార మాసోత్సవం


బొబ్బిల్లంక అంగన్‌వాడీ సెంటర్‌లో పౌష్టికాహారం ప్రదర్శన

సీతానగరం: బొబ్బిల్లంక సెక్టార్‌లోని 20 అంగన్‌వాడీ సెంటర్ల ఆధ్వర్యంలో బొబ్బిల్లంక అంగన్‌వాడీ సెంటర్ 2లో బుధవారం పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.ఇందిరా భారతి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పంచాయతీ ఉప సర్పంచ్ కోమలి వీరబాబు హాజరయ్యారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలున్న తాటి గారెలు, రాగిలడ్డు, హల్వా, ఆకు కూరలతో చపాతీలు, గుడ్డులతో జున్ను, అటుకులతో ఉప్మా, మొక్కజొన్న వంటకాలు తదితర 25 రకాలను ప్రదర్శించారు. బాలింతలు, గర్భిణులకు వాటిపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎం దేవి, ఎంఎల్‌హెచ్‌పీ ఎం.నాగశ్వేత, అంగన్‌వాటీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ముంగిటకే వచ్చిన సంక్షేమం


సుభద్రంపేటలో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు

రంగంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు దరిచేరాయని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. సుభద్రంపేట సచివాలయం వద్ద సర్పంచ్ కూటి సాయి తాతారావు అధ్యక్షతన కొత్తగా మంజూరైన 13 కొత్త పింఛన్లను బుధవారం ఆయన అవ్వాతాతలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ టీడీపీ హయాంలో పింఛన్లు మంజూరు కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగి, లంచాలు చెల్లించాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పింఛన్లు ఇంటి ముంగిటకు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులకు చర్యలు

సాక్షి ఇంపాక్ట్


ఎస్టీ రాజాపురం సమీపంలో పనులు చేయిస్తున్న ఎస్సై

రంగంపేట: రాజానగరం- సామర్లకోట ఏడీబీ రోడ్డు విస్తరణ పనుల పేరిట కాంట్రాక్టర్లు చేసిన పనికి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. పలుచోట్ల రోడ్డును తవ్వేసి వదిలేయడంతో రాకపోకలకు తీవ్ర జాప్యం జరుగుతుంది. దీనిపై 'గంటల తరబడి స్తంభించిన ట్రాఫిక్' అనేక శీర్షికన 'సాక్షి'లో మంగళవారం వార్త కూడా వచ్చింది. ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో బుధవారం రంగంపేట ఎస్సై టి.రామకృష్ణ చొరవ తీసుకుని ఆర్అండ్‌బీ ఈఈ వర్మ, ఏడీబీ రోడ్డు కాంట్రాక్టర్లను రప్పించి మరమ్మతులు చేపట్టాలని కోరారు. దీంతో ఏడీబీ రోడ్డుపై గోతుల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.